# మూడు రాత్రులు

* * *

భాయీసాబ్ ...

—అన్నమాట చెల్లించుకుందామనే పట్టుదలేతప్ప...నిజంగా నీకు ఉత్తరం వ్రాయడానికి కావలసినంత హుషార్...ఏమీ ఒన గూడే భాగ్యం ఈ సోదరుడికి లభించింది కాదని... చదివినతరువాత నీకే తెలుస్తుంది.

మధురానుభవములకోసం...ఉవ్విళ్లూరడం అడియాస అని... కల్పించుకున్న ఆకాశహర్మ్యముల పునాదులు కదిలిపోయిన తరువాత కాని... అవగతము కాలేదు.

మొదలు... ఏమీ వ్రాయకూడదనుకున్నాను. ఈ సంగతే ఇక తలపెట్టకూడదు, మరచిపోదామనుకున్నాను. కాని, ఎదుటకు వచ్చిన తరువాత, ఏలాగూ వదలవుకదా... చెప్పక తప్పుతుందా; నీవు ఊరుకుంటావా...అప్పుడు బిడియపడుతూ...సగంచెప్పి— చెప్పక నిన్ను అలయించి...విసిగించడంకన్న...ఇలా చేస్తేనే బాగుంటుందని తోచింది.

ఇంకొక కారణం కూడాను. ఎటూ పాలుబోకుండా, మానసికంగా త్రిశంకు స్వర్గవేదన అనుభవిస్తూన్నాను గనుక...ఉద్ధరించే బాధ్యత నీదైనప్పుడు విషయం నీకు సమగ్రముగా తెలియకపోతే ఏలాగ ?... కర్తవ్యం ఉపదేశించడానికి...నీకు...ఆలోచించడానికి, ఈ గడువు చాలుననుకుంటాను. నేను వచ్చిన తరువాత, మళ్లా ఏమీ ప్రశ్నలువేసి బాధించకు. ఏమీ దాయకుండా వ్రాస్తూన్నాను...సందేహించకుండా...నీకు, సందేహాలు కలుగకుండా.

తత్వ దృష్టితో చూస్తే... ఈ కలాపమంతా చాలా సరదాగానే ఉన్నది—ఊహించి, మనం కల్పించి గ్రంథస్థము చేసే సంవిధానాలకన్న... ఈనటనస్వానుభవంగా ప్రత్యక్షముకావడం...! కాని, నాయకుడు నేనేకదా అని... కించ.

దురుసుగా ... అపార్థములుతీసి ... నన్ను విమర్శించకు. మిన్ను విరుచుకుని మీదపడే సమయాల్లోనైనా ... తొణకని, నీ హుందాతనం... ఈసంక్షోభార్ణవమగ్ననికి ఆసలా అయి తెప్పరిల చేస్తుందనే ధైర్యం నాకు ఉండటంచేతనే... సావధానంగా ఆలోచించమని అవసరంలేకపోయినా... హెచ్చరిక !

ఉత్సాహసామగ్రి అంతా... పుష్కలంగా అందుబాటులో ఏర్పరుచుకుని, మరీ... చదవడం మొదలుపెట్టు. సిగరెట్లు అయిపోయినా, టీ చల్లారి, రుచి తక్కువ అయినా... వాటిమీద కోపం... నామీదకు మరలించకుండా.

'కర్మణ్యే వాధికారస్తే... '—గీతావాక్యం మనమెడల తలక్రిందులుగా అన్వయించుతూన్నది. ఉబలాటపడి, చేసినవారు, పెద్దలు: ఫలం అనుభవించే అధికారం, ఆ మంచి చెడ్డలు... మనది !

చెట్టుగా ఉన్నప్పుడే ఏప్రయత్నమూ చేయకుండా ఊరుకుని... తీరా ముదిరి మ్రానైన తరువాత, మరమ్మతు చేయడానికి తలపెట్టడం... ?

ఒకటిలే : ఇంతకూ...అన్నీమనం అనుకున్నట్టుగా జరిగితే... ఇక చెప్పవలసింది ఏముందీ ?

ఎంత ముచ్చట పడ్డానో... ఎంత ఉవ్విళ్ళూరానో... ! ఎందుకులే...అవన్నీ ఇప్పుడు, తలచుకున్న కొద్దీ...యౌవనోదయభాగ్య జీవన స్వర్ణసంక్రాంతిలో ...అన్నీ హంసపాదలే.

ఛాందస తతంగమూ... పబ్లిసిటీ...వద్దని పట్టుబట్టాను... బ్రతిమాలాను, మావాళ్లని. మనసులో ఏమనుకున్నా... ఒప్పు

కునేవారేమో కాని, మా అత్తవారి తరఫునుంచి వచ్చింది ఉద్దడి. మా, మామగారి తల్లి...ఆ ముసలితొక్కు, మనుమరాలు-మనుమడూ, పీటలమీద కూర్చుండగా చూసి సంతోషించాలనే... ప్రత్యేకం అందుకోసమనే... ఇంకా బాల్చీతన్నేయకుండా, కని పెట్టుకుని ఉందట...! ఆ ముసలిపాపాయి ముద్దు చెల్లించవద్దూ... అది ముఖ్యం కాదూ?

మోతుబరి ఆసామి కనుక మా మామగారు...పునస్సంధానానికే... పెళ్ళంత ప్రయత్నం చేశాడు. మూరుమూలల బంధువులందరూ...సకుటుంబసపరివారంగా...ఇంట్లో పొయ్యిలు తిర్వేసుకుని తరలివచ్చి...కిక్కిరిసి ఉన్నారు.

ఇక, ఆనాడు, ఉదయంనుంచీ... రాత్రిదాకా నడచిన తంతు...మనం మామూలుగా విని నవ్వుకునే, పూర్వకాలం పంపిణీకి, శతగుణితంగా ఉన్నదనుకో. పవలూ రాత్రికూడా సరిగా భోజనం పెట్టకుండా...ఇక, మెహర్బానీగా అల్లుడుగారికోసం తయారుచేసిన కాఫీ, అధ్వానంగా, కుడితిలాగు ఉంది. వేధించుకుతిన్నారోయ్... వీళ్ళ ఛాందసం కూల!

సాయంకాలం...యథాప్రకారం, బ్రాహ్మణోత్తములు... సామవేదం పనసచదివి...వాళ్లు ఆ...ఊ...ఉ...అనడం వింటే చెడ్డనవ్వువస్తుంది, నాకు. సంభావనలుకాజేసి...వెళ్ళిపోయిన తరువాత, నేను...స్త్రీ రాజ్యంలోకి...ఖయిదీఅయినాను. రవంతగది. సరిగా మెసలడానికే వీలులేదు ... చూస్తేనే ఊపిరిసలుపనట్టు ఉన్నది!...ఆ గదిలో...ఆడవాళ్ళ తండావచ్చిపడి—ఎందుకులే... ఆ సంగతులు తలచుకుంటేనే చిరాకు ఎత్తుతూన్నది...

చివరకు, ఇద్దరం మిగిలాం. మా ఆవిడ... పందిరిమంచం స్తంభాన్ని అనుకుని, తలవంచుకుని...నిలుచున్నది. నేను...ఏలాపలుకరించాలి, ఏమనాలి?...ఒక నిమిషం నిదానించాను: తలఎత్తి

కథా నిలయం
1551

చూస్తుందేమో, చూపులు కలపవచ్చునని...నవ్వించాలని. తరువాత చొరవచేసుకుని, మాటాడించలేకపోతానా ?...

కాని కదిలితేనా...? స్థాణువై అలాగే నిలుచునేఉన్నది!

బల్లమీద...తినుబండారాలు ... కృష్ణదేవరాయలనాటివి... పెద్దపళ్ళెంలో...ఒక సంతర్పణకు సరిపోయేవి ఉన్నాయి. దయదలచి తడి అంగవస్త్రం ఉంచడం మానివేశారు...! మునుపు ... పెళ్ళికొడుకులు అంటే ఏమనుకున్నావు ఏమిటి...? కాశీలోపడి... చదివి చదివి... యాదృచ్ఛికంగా, గురువువృద్ధుడైతే, తారాశశాంకనాటకం ఆడి .. గడ్డాలు మీసాలు ముదిరి, కాశీకావడితో స్వదేశానికిమళ్ళి వచ్చి...అంతకు ముందే భార్యయీడేరి సిద్ధముగా ఉండటంచేత... కార్యమని...పెళ్ళికొడుకు ... ఊళ్ళోదిగగానే ... ముహూర్తము ఏర్పాటుచేసేవారట...! మడీ ఆచారమూకాదూ, గదితలుపుగడియ పడ్డతరువాత, పెండ్లికుమారుడు కాళ్ళూచేతులూ కడుక్కొని...తడి అంగవస్త్రంకట్టుకుని...లక్షణంగా, పెట్టిన మినపసున్నీ అరిశెలూ వగయిరా ఆఖరుచేసి...ఆబందోబస్తుతో, తృతీయపురుషార్థంమాట తలపెట్టేవాడట!...ఆలాటివారి సంతానం...రాళ్ళలాగా, రోగం రొష్టూ లేకుండా ఉండేదని...మన ముసలమ్మలే ప్రమాణం!

—జంతికముక్క ఒకటి విరిచి మీదకు విసిరాను. అరిశముక్కలు...క్రమంగా మినపఉండలు, తుంచి ... మొత్తంమీద పళ్ళెంలో భక్ష్యాలన్నీ సరాగంలో ఖాళీచేశాను. మా కాళ్ళముందర అవిఅన్నీ, చిందరవందరగా చెదిరిపడిపోయి ..నేలఅంతా...లడాయి అయిన మర్నాడు బందరు రోడ్డులాగా ఉన్నది.

ఇక విసరడానికి ఏమీలేవు ... పళ్ళెం తప్ప ...! తగిలిన వాటిని ఖాతిర్ చేసింది కనుకనా ?—రాళ్ళవాన కురుస్తూన్నప్పుడు గోవర్ధనంక్రింద దాక్కున్న గోపికలాగా...

సమీపించి, చుబుకం పట్టుకొని, మొగం ఎత్తడానికి ప్రయత్నం చేశాను. ఉహుఁ...కదలందే...! యోగాభ్యాసిలాగు బిగబీసుకుని ఉన్నది. ఇంకో ప్రక్రియ ఉపయోగించుదామని...చేయి మీటగా పట్టుకుని, దగ్గరకు లాక్కుందామని గుంజాను. కాని, ఎడమచేత్తో మంచం స్తంభం పెనవేసుకుని...వదలందే...! ఇలా టగ్-ఆఫ్-వార్ కొంతసేపు జరిగింది,—శత్రువులు క్రమంగా, బడలిపోయి, లోబడే సూచనలు కనబడుతూండగా...

బయటనుంచి, తలుపు ఒకటి రెండుసార్లు ఊచి, ధడ ధడ కొట్టి...'ఓమారు, కాస్త తలుపుతియ్యి నాయనా... మళ్లావేసుకుందువుగాని' ... అంటూ పిలుపు!

...తలుపు తీశాను. మా అత్తవారి తరఫు ఆమె...ఏమవుతుందో తెలియను, విశ్వస్థ, ముసిముసినవ్వులతో...లోపలికివచ్చి...మంచం చాటున ఉన్న పెరుగుకుండ,... కప్పినవిస్తరీ, ఎత్తుపెట్టిన పిడకా, అక్కడేపడేసి...బయటికి తర్లించుకుని పోయింది. నాకు, బలే నవ్వు వచ్చింది. నవ్వితే, ఆమె ఏమనుకుంటుందో అని, తలుపు దగ్గరగాలాగిన తరువాత గడియ వేయవచ్చునని...అలా నిలుచునే ఉన్నాను.

తక్రఘటధారిణి...అక్కడ నుంచి కదలే పోహణ కనుపించలేదు. నేను, తలుపు వేసుకునేందుకైనా వీలులేకుండా...గుమ్మంలో, ఓకాలువేసి, ప్రక్కకు తొంగిచూస్తూ ఆలకించుతూన్నది—

'కనిపించాడా అమ్మా?'...అని ఎవరినో అడుగుతూంది.

'లేదే అమ్మా!...మీఅల్లుడుగారు...ఊరూనాడూ వెదికి వచ్చారు. ఏమైనాడో అమ్మ!'—దృష్టిగోచర అయిన...నడివయసు సువాసిని జవాబు చెప్పింది.

'కొంటె కుంక, ఓచోట నిలుస్తేనా...? ఎక్కడకు వచ్చినా, ఇదే కుమ్మరాం. వట్టి గడుగ్గాయి అయిపోతున్నాడేం...! ఏమూలన్నా నక్కాడేమో...' ఇది పెరుగుకుండ ఆమె వ్యాఖ్యానం.

'అవునేవ్!...' అని ... ఏదో ఆలోచన తోచినట్టుగా, తల్లితో రహస్యంగా ఏదో అన్నది...సువాసిని. ఇద్దరూ గుసగుసలాడుకున్న తరువాత...

'లక్షణంగానే ఉంది...'అని సణుగుకుంటూ, విశ్వస్థ... మళ్ళాలోపలికి వచ్చింది.. కూతురుతో సహా. ఇద్దరూ, తొంగి చూస్తూ... చివరకు, కూర్చుని...మంచంకింద వెదికి... కావడిపెట్టి చాటునుంచి... ఓ కుర్రివాణ్ణి బయటకు లాగారు...! నిలవేసి...చెవి మెలిపేసి...తల్లీ, ముత్తవ్వాను...సవాలక్షచదివి, నా ఎదుటనే పంచాయతీ తీర్చి— పిల్లవాడు, వాడి పుణ్యమూ అంటూ గింజుకుని పారిపోకపోతే,— తెల్లవార్లూ నన్ను వేధించుతూ ఆలాగే ఉండి పోయేవారను కుంటాను,...వాడిని తరుముకుంటూ, ఏలాగైతేనేం... దయదలచి... అక్కడనుంచి వెళ్లిపోయినారు.

మళ్ళా.. యథాప్రకారం...! మా కొయ్యబొమ్మ.. మా టాడితేనా...? ఎన్నివిధాలో ప్రయత్నించాను. తెలివితేటలన్నీ వినియోగించి చూశాను. సినీమా అనుభవములన్నీ నెమరుకు తెచ్చుకున్నాను. కాని, ఊహుఁ...

అరసికత్వానికి...నన్ను మన్నించాలి. కాని, ఏమి చేయను...? వేడివేడి కోరికలకు పొంగురాకుండా, నిగ్రహించగలిగిన సామర్థ్యం లేకపోయింది. నింపాదిగా యోచించే అంత సహనంకూడా లేదనుకో. మోటగా...పశువైఖరిని...మొక్కు-తీర్చుకున్నాను...!

నామీదనే నాకు అసహ్యం కలిగింది——చేసినపాడుపనికి...! అప్పటి ఉద్రేకం అంతకన్న వేరుమార్గం చూపించిందికాదు.

ఇకనైనా...సిగ్గుతీరిందేమో ననుకున్నాను. చనువుగా పలుకరించాను. సరదాగా మాటలాడుతుందేమో ననుకున్నాను. పడిన శ్రమకు ఫలం ఇంతటికన్నా అబ్బుతుందేమో!...కాని...అనుభవించక తప్పుతుందా, భయ్యాః! పూర్వజన్మకృతం పాపమ్...! మాటా లేదూ, మన్నూ లేదు.

కోడి కూసేవేళకు...కొంచెం కూరుకుపట్టింది. మెలకువ వచ్చేటప్పటికి బాగా పొద్దెక్కింది. మా పెండ్లికూతురు చీకటితోనే...బయటికి వెళ్ళిపోయిందికాబోలు, తెల్లవార్లూ మేలుకునే ఉన్నదేమో...ఆమె విషయమే...ఆ తరువాత, నేను గమనించ లేదులే.

—ఇక మరునాడు :

నిద్ర మేల్కొంచినప్పటినుంచీ కూడా...రాత్రి అనుభవించినదంతా, పీడకలలాగు కనిపించి... చాలా వేదనపడ్డాను. అక్కడ నుంచి తక్షణం బయలుదేరి పోవాలని, మొదటి ఆలోచన. ఎవరు ఏమనుకుంటేనేం?...నామనసులో యాతన అందరికీ ఎలా తెలుస్తుంది? పైగా ఎవరిది ఏం పోయింది? రాత్రి భార్యను సరిగా పలుకున్నందుకు...వాళ్ల దృష్ట్యా... అభినందనపుచూపులు విసిరే వృద్ధ స్త్రీలోకమును చూసినకొద్దీ...ఉన్న పాళమున, అప్పటికప్పుడు జండా ఎత్తేద్దామనుకున్నాను.

ఆ...అమ్మాయితో... కాపురం చేయడం అసంభవం. మా యిద్దరికీ పొత్తు ఎలా కుదురుతుంది?...పల్లెటిదిక్కుమైతు ... లోకజ్ఞానం బొత్తుగాలేనిది... సనాతన మర్యాదలది,—ఆమెను వెంట తీసుకునివచ్చి... ఏం చేయడం?

—వదిలి వచ్చాననుకో. మా, మామగారు ఘటికుడు; ఊరుకునే రకంకాదు. నా పెళ్లి అయినప్పటినుంచీకూడా...'నారీణాం చిరవాసోహి బాంధవేషు నరోచతే...సతీమపి జ్ఞాతికులైక సంశ్రి

యాం, జనోన్యథా భర్తృమతీం విశంక్యతే... భాగ్యాయత్తమతః వరం నఖలు తద్వాచ్యం వధూబంధుభిః'—ఇలాటివి, కొన్ని సహ పాఠిలు శ్రీసూక్తులు వదులుతూండేవాడు. ఆయనఊరుకుంటాడా?... చల్లగా, మంచిరోజుచూసి, ప్రయాణంచేసి తీసుకువచ్చి ... నేను ఎక్కడ ఉంటే అక్కడ దింపి చక్కాబోతాడు. మళ్ళాతిరిగి చూడడు. మేము ఏమైనాసరే...

అదీచిక్కు! నామాటకు ఏమికాని, అప్పుడు ఆ అమ్మాయి పని ఏం కావాలి?...నాకు అక్కర లేక...పుట్టింటివారు చేరనీయక, పైగా, చేతులార చేసుకుంటినికూడా నామెను...గడిచినరాత్రికి... యావజ్జీవం... బాధ్యతనామీద పడలేదూ?

ఇంకొకటి: ఆమె మనోగత భావములకు చక్కిలిగిలి పెట్టే రసికత్వం మనలో లోపించిందా అనే శంక...! ఆమెను, అర్థంచేసుకో లేక పోయినానేమో...? అలరించడం చేతకాలేదేమో...? ఆనాటికి...తొందర పడకుండా...లేచిపోయి వచ్చేసే ప్రయత్నం విరమించుకుని...ఏలాగైనా ఆమెను సుముఖినిగా చేసుకోవలెననే దీక్ష పట్టాను.

రాత్రి...ఏకాంతమున...

బయట చక్కని వెన్నెల వచ్చింది. మాగది కిటికీల అవతల మెరాబాలో మంచి జాజి పొద ఉన్నది. లోపల—ఉక్కపోతు న్నాము. మరీ. ఊరగాయల కొట్టు లాటిది ఆ 'శయ్యాగార'మని... నీవు అర్థంచేసుకునే ఉంటావు...ఈపాటికి! ఆరుబయట, ఎందుకు మంచం వేసుకోకూడదూ అని—

'చూడు... సుభద్రా!... (మాగృహిణినామం...సుబ్బ మ్మలోంచి, సుభద్రలోకి ఇటీవల మారిందటోయ్, మనకు ఎవరికీ తెలియకుండానే. మా, మామగారు...నేను దిగగానేచెప్పిన మొదటి

శుభవార్త అది)—వెన్నెలలో కూర్చుందాము, రావూ?...' అని బ్రతిమాలుతూ అడిగాను.

నేను...పేరుపెట్టి పిలిచినందుకు, ఆ అమ్మాయి ఎక్కడలేని ఆశ్చర్యమూ...కళ్లలో కనబరచింది. బహుశః వింతగా తోచి ఉండవచ్చును. వాళ్ల వంశంలో, బంధుకోటిలో, ఎవరూ భార్యలను పేరుపెట్టి పిలిచిన పాపానపోయి ఉండరు...! మరీ మాలకూడు అయిపోయి, సంకరం చేస్తూన్నవి...మన చదువులే కాదూ?

'ఏం...'—ఓంకారంలో త్రిమూర్తుల అంశలూ ఇమిడినట్లు, ఆ 'ఏం...'లో,—'ఏమిటి, వెన్నెలలో సరదాగా కూర్చోడం నీకు యిష్టమవునా, కాదా ? కాకపోయినా, నేను కోరుతున్నాను కనుక నీవు ఒప్పుకుని తీరాలి ?'—అనే లాలన...ఆజ్ఞ... ఇంత ఇమిడించాను.

'ఆరుబయట...భారకిస్తుంది...'

—అమ్మబాబు! మాపెద్దలందరూ తరించారోయ్...! మా గృహిణి నోరువిప్పి...ముత్యాలురాల్చింది!

'భారకంలేదు...సింగినాదంలేదు...లేచిరా...'—కొంచెం గదమాయించితేనే కాని కార్యం సానుకూలమయ్యేటట్లు లేదు.

సుభద్ర...తలవంచుకునే...లేచినిలుచున్నది.

చిన్నమంచం... లేదు. పందిరిమంచం చక్కీ...బహుప్రియాసతో—అది చచ్చినగేదెదూడంత బరువున్నదోయ్...! సరే మంచం సంగతి చెప్పనక్కరలేదు... మూలిసిస్ పడకగదిలో నమోనాచూసి తయారుచేయించిన బాపతు—ఏలాగైతేనేం... బయటకు చేరుకున్నాం.

నడుమువాల్చను. సుభద్ర, వచ్చి దగ్గరగా కూర్చోవద్దూ? ఉహుం...దానికిమళ్ళా బ్రతిమాలించుకుంది...

'వెన్నెల...ఎంత బాగున్నదో...'

'ఇన్ని జాజులు ఉండగా...పోగ్గా వంకీజడ వేసుకోలేక పోయి నావా ?...'

'సిల్కు చీర... నేను పసందు చేసి తీసుకువచ్చాను...కట్టుకో లేదేం...'

—ఏ మాటకూ జవాబు లేదు, కారణం...ఏం చెప్పాలో తెలియక. ఆలా తయారు చేశారోయ్ వాళ్లవాళ్లు...! ఆడవాళ్ళు ఎందుకు...అనే ప్రశ్నకు... వెంకటేశం సమాధానాలు ఉన్నాయే.. అంతకన్న పరిజ్ఞానం ఉన్నట్టు తోచదు మా ఆవిడకు...! ఏదో మాటాడుదామని పెదవులు కదిపేది...కాని, మాట బయటికి రాందే !

వెన్నెల సరదాలన్నీ... ఆ అమ్మాయిని అలా చూపెట్టుకుంటూ... నేనే తీర్చుకున్నాను. జాజిపూలతో ఆమెను...వనదేవతను చేశాను. పక్క అంతా విరజిమ్మాను. నవ్వాను... ఈలవేశాను,—ఈ ఉత్సాహమంతా... ముంచేస్తూన్న నిరాశను కప్పి పుచ్చడానికి...

చివరకు...మామూలుగా...సామాన్య సంసారిలాగా...!

—తెల్లవారింది... పొద్దుగుంకింది. నామనసులో పవలంతా... నేషనల్ కాంగ్రె సంత హడావుడిగా ఉన్నది. ఈవిషయం తలచుకుంటే...గుండెల్లో స్పెషల్ రైళ్ళు పరుగెత్తడం మొదలుపెట్టినవి. ఏమిటి చేయడం... అనేదే జపం అయిపోయింది...! ఆమె...నాకు జోడైన భార్యగా, సరదాలన్నీ తీర్చే వివేకవతినిగా తరఫీయత్ చేయడానికి. ఈ జీవితమంతా వినియోగించడమా...? అంతకన్న సులువుగా అయేపని కాదోయ్ అది... ! తరతరాలనుంచీ పాదుకు పోయిన ఛాందసత్వమును పెల్లగించి, కొత్త కోరికలను అల్లించడానికి దోహదం చేసి... వర్ధిల్ల జేయడం... మాటలతో ఉన్నదా?...

లేక, ఈ బాదరబందీ అంతావదిలివేసి, పాపమో, పుణ్యమో... ఉడాయించేసెయ్యడమా... ? ఏమీ తేలడంలేదు...

ఆఖరుకు... మూడవ నిదుర ముచ్చటకూడా తీరనిద్దామనుకున్నాను: నిజానికి... ఆమెను చూడగా, వదల లేక పోతున్నాను. శారీరకములైన వాంఛలు, ఆమె రమ్యాకృతిని గౌరవిస్తూన్నవి. మనసు... ఈ అరసికురాలితో నీకు ఏమిపని అని ఎదిరించి పోట్లాడుతూన్నది: రెండింటినీ కాదన లేకుండా ఉన్నాను. ఉపాయం నీవు చెప్పవలసినదే ఇక ...

—మరో ఉపాయం తోచింది. లాలనగా ఆమె లోంగిపోనప్పుడు... జాలి అన్నా కల్పించితే...క్రమశః చనువులోకి దింపవచ్చును కదా...అని, రాత్రి...మేము ఒంటరిగా మిగిలిపోగానే... బద్ధకం, శిరోభారం అభినయించాను—ఆ ఆదుర్దాతో అయినా సిగ్గుతెరవిడిపోతుందేమోనని ... కాని—

మంచంమీద కూర్చునిఉన్నవాడినల్లా...అబ్బా! అనుకుంటూ పక్కకు ఒదిగి... 'చూడు...సుభద్రా...తల బరువుగా ఉన్నది...'

ఇంకా, చెపుతూన్నది సాంతం వినిపించుకోకుండానే...ఆమె, చివాలున, ఆదుర్దాతో మాత్రం అవును... లేచి వెళ్ళిపోయింది...!

దగ్గరగా కూర్చుని...ఉపచారములు చేయడానికి పూనుకుంటుందేమో,—ఏలా ఉన్నది...కొంచెంనింపాదేనా...అని పలుకరించుతూంటుందేమో,— తల...తోడమీద జేర్చుకోనిస్తుందేమో,— అని ఉవ్విళ్లూరినందుకు...వంక పన్నినందుకు...ఫలం...

ఏఘాటైనమందో తీసుకువచ్చి... తలకు పట్టించిందాఅంటే... లేనిదిలేకపోగా...కళ్ళూ మొగం మండిపోయి అదోయాతన అనుభవించవలసి వస్తుందే ?...

'ఏం నాయనా ?'—అని గుమ్మంలోనుంచే పలుకరించు తూ...ఇంతకుపూర్వం ఉదహరించానే...పెరుగుకుండ ముసలమ్మ... ఆమె తయారయింది,...మా మామగారి తల్లిని తోడు తీసుకుని.

వారు...యకాయకి లోపలికిరావడంచూసి ... లేచికూర్చు న్నాను. నన్ను మరేమీ పలుకరించకుండానే... మెదలనివ్వకుండా నే...చేతులోవున్న శొంఠిగంధం...గుమ్మానికి పసుపుమెత్తినట్టు... మొగమంతా రాచి...(ఈపని తక్షి విశ్వాస్యవంతు)... 'ముసుగు పెట్టు కుని మెదలకుండా పడుకోవోయి... తెల్లారేటప్పటికి తగ్గిపోతుంది. అయినా, ఈకాలం ఆరుబయట పడుకోమని ఎవరుచెప్పారు... మంచు కురిసే దినాలుకదా...? ఇప్పటి తగిలీ ఇదీ'...ఇద్దరూకలిసి, ఈపనస చదివి...నిష్క్రమించారు, గదితలుపు దగ్గరగా వేసి...!

ఇంకా నయమే అంతటితో వదిలారు. కలికం వేస్తామని పట్టుపట్టి నట్లయితే...మా ముత్తాత జ్ఞాపకం వచ్చేవాడు...నసాళం అంటి!

పట్టు కడిగివేసి...పడుకున్నాను. సుభద్ర...ఏదీ ?... చేతులారా, నేను తెచ్చిపెట్టుకున్నదే కాదూ, ఈ అవాంతరం?... సుస్తీగా ఉన్నదని ఇంటిల్లిపాదికీ తెలిసిపోయిన తరువాత...ఇక, ఈ చాయలకైనా రానిస్తారా...? మామంచికోసమే ననుకో...

ఒంటరిగా...నిజంగా సుస్తీగా ఉంటే... దగ్గర...పిలిస్తే పలికే దిక్కు లేక...బాధపడుతూ ఉండవలసి వచ్చేదే కాదూ?... ఆ మాత్రం ఇంగితం లేదూ...? నన్ను ఇలా వదిలివేసి... తాను దూరంగా... ఎక్కడో వాళ్ల వాళ్ల మధ్య పడుకోవడమేనా ?

—నాకు, విపరీతమైన కోపం వచ్చింది. పిలిచి...నాలుగు ఇచ్చుకుందా మన్నంత ఒళ్ళుమండి పోయింది. అలాగే...ఆలోచన లతో...ఉద్రేకంతో...రాత్రిఅంతా గడిపాను. ఆనాడు...నా అవస్థ...వర్ణనాతీతం ! పగవాడికైనా వద్దు...

తెల్లవారుతూన్నదనగా... కనులు, ఉదయ మందవాయువుల హాయికి... మూతపడుతూండగా, తలుపు తీసుకుని... సుభద్ర వచ్చింది...! నిసురమత్తుతో...చూడగానే...అమితోత్సాహంతో... లేచి కౌగలించుకుందా మనుకున్నాను. కాని, ఆమె ఏం చేస్తుందో గమనించవలెనని కనులు అరమూసి నిద్రితుని లాగు ఉండి పోయి నాను...

సుభద్ర...తిన్నగావచ్చి...నా...పాదాలకు చేతులుఅద్ది... కళ్లకు అద్దుకుని...తిరిగి వెళ్లిపోయింది...!

అయ్ ఖుదా !

ఆమె...అలా...నాపాదములు స్పృశించితే దేహమంతా తేళ్లు జెర్రిలూ పాకుతూన్నట్టు కంపరం ఎత్తిపోయింది. ఈ పాతివ్రత్య మంతా...ఎలాగోయ్ భరించేది...? ఇలాటి దానికి...నాగరికం అల వాటు చేయడం నా తరమా ?

—వెనుకటికి, మా బంధుకోటిలో ఒక ఆమె...సర్వకాల సర్వావస్థలలోనూ... మడివిడవకుండా...పూజాగృహం గుమ్మం దాటకుండా ఉండేదట...! ఎవరన్నా...చివరకు ...ఆ చేసుకున్న ముండావాడైనాసరే...ఆమెతో మాట్లాడాలని...ఆ గదిలోకి వెళ్ళి తే...వాళ్ళు అక్కడనుంచి లేచిపోగానే కూర్చున్న స్థలం...శుద్ధిచేసే దట ..! మా గృహిణి కూడా, ఇంకా నాలుగురోజులుపోతే ఆలా తయారవుతుంది...సందేహంలేదు.

ఏంచేయను ? నాకు మొదట తోచిన ప్రశ్నే...నేను నిర్ధా రించుకోలేని విషయమే...నిన్ను అడుగుతూన్నాను. తెంచుకుని పారిపోవడమా ?... యావజ్జీవం, యీ గుదికొయ్యను మెడకు వేసు కుని...యాతనపడటమా...? ఆమె మారిపోయి...నాకు అక్కరకు వస్తుందనే నమ్మకం లేశమున్నా లేదు. కర్తవ్యం ఏమిటో నీవు ఉపదేశించాలి—

ఒక, షరా: పెద్దల అపరాధాలు వారసత్వరూపేణా మనకు సంక్రమించేవి కనుక... త్యాగం చేయవలసిన బాధ్యత నామీద ఉన్నదనే పెద్ద ఆలోచనలోకి పోవద్దు. విధికి తలబగ్గి... జితోస్మి అనే అలసత్వం నన్ను ఇంకా ఆవహించలేదనే సంగతి జ్ఞాపకం ఉంచుకో. నామంచికి... నా పురోవృద్ధికి... ఇతరులెవరికీ ఈమూలమున అపకారం జరుగకుండా... నేను చేయవలసినది... ఏమిటి ఇప్పుడు...?

బాగా ఆలోచించి... నేను వచ్చేటప్పటికల్లా... జవాబు చెప్పడానికి... తయారుగా ఉండాలి సుమా ?—నేను... ఏంచేయాలి... చేయడం ఉత్తమం...?

నీ

'.........'

* * *